క్లుప్తంగా

4న జాబ్ మేళా

తుని రూరల్: వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత శుక్రవారం తెలిపారు. ఐఐఎఫ్ఎల్ సంస్థలో పని చేయుటకు ఇంటర్మీడియెట్, ఆపై చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల లోపు యువకులు అర్హులన్నారు. తెలుగు, ఇంగ్లిషుపై పట్టు ఉండి ద్విచక్ర వాహనం ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలను 70139 80150 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలంటూ బైక్ ర్యాలీ



తునిలో ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

తుని: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని సీఐటీయూ నాయకుడు ఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వీరవరపు పేట నుంచి గొల్ల అప్పారావు సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన పరిహారాన్ని విడుదల చేయాలని కోరారు. కార్మిక సంక్షేమ బోర్డులో నిధులను కార్మికుల కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఆంజనేయులు, రాముడు, వెంకన్న, విశ్వం, చంటి, శ్రీను పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయం



తుని లో విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న రవీంద్ర

తుని: తుని వాకర్స్ హెల్త్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సుంకర రవీంద్ర అన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బ్యాంక్‌కాలనీ సరస్వతి శిశుమందిర్‌లో మొక్కలు నాటి 86 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 50 మందికి యూనిఫాం పంపిణీ చేశారు. విద్యార్థినులు పట్టుదలతో చదివితే కార్పొరేట్ దీటుగా ఉన్నత ఫలితాలను సాధించవచ్చని రవీంద్ర పేర్కొన్నారు. వాకర్స్ హెల్త్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణ, జిల్లా గవర్నర్ భాస్కరరావు, ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ, ఇంటర్నేషనల్ క్లబ్ కార్యదర్శి ద్వారాకా నాథ్, డిప్యూటీ గవర్నర్ రెడ్డి రత్నం, తుని శాఖ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ పాల్గొన్నారు.

గంగవరంలో పాల సేకరణ కేంద్రం ఏర్పాటు

రౌతులపూడి: మండలంలోని గంగవరంలో జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని (జగనన్న పాల సేకరణ కేంద్రం) ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.గోవింద్ తెలిపారు. ఇప్పటివరకూ మండలంలోని 14 జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బంగారయ్యపేటలోని కేంద్రానికి పాల దిగుబడి లేకపోవటంతో ఈ కేంద్రాన్ని గంగవరం మార్చినట్లు ఆయన తెలిపారు. గంగవరంలో పాడిరైతులు ఎక్కువుగా ఉన్నట్లు గుర్తించామని, దీంతో ఆ గ్రామంలో పాలవెల్లువ కేంద్రం ఏర్పాటు చేసినట్టు వివరించారు. పాడి రైతులు పాలవెల్లువ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మురిపింఛన్

- జోరుగా సామాజిక పింఛన్ల పంపిణీ
- లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేసిన వలంటీర్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న పింఛనుదారులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెలా ఠంచన్‌గా పింఛను అందుతోంది. గతంలో పింఛన్ల కోసం అవ్వాతాతలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి చూసేవారు. ప్రస్తుతం గ్రామ వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల తలుపుతట్టి పింఛన్ సొమ్ములు అందజేస్తున్నారు. ఇంటికే పింఛను అందడంతో అవ్వాతాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తొండంగి: మండల వ్యాప్తంగా శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీ జరిగింది. తొలిరోజు 90 శాతం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ గురువారం తెలిపారు. మండల వ్యాప్తంగా 12341 మంది పింఛనుదారులు ఉండగా రూ.3.40 కోట్లు విడుదలయ్యాయి. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్ల ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కాగా ఇటీవల కొత్త పింఛన్ల కోసం 873 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 260 మందికి మంజూరైనట్టు ఎంపీడీఓ వివరించారు. మిగిలిన దరఖాస్తులను వెరిఫికేషన్ చేస్తున్నామన్నారు.

కిర్లంపూడి: మండలంలో తొలిరోజు శుక్రవారం 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తెలిపారు. గ్రామ వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ములు అందజేశారు.



కాకినాడ జీజీహెచ్‌లో అప్పారావుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ సౌందర్య

ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందజేత

జగ్గంపేట: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కొండపల్లి వెంకట్రావు క్యాన్సర్‌తో బాధపడుతూ కాకినాడలోని మెడికోవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడు పింఛనుదారుడు కావడంతో గ్రామ వలంటీర్ పైడి మణికంఠ ఆసుపత్రికి వెళ్లి శుక్రవారం పింఛను సొమ్ము అందజేశాడు. వలంటీర్ మణికంఠను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.



బూరుగుపూడిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రసాద్‌బాబు

70 శాతం పింఛన్ల పంపిణీ

ప్రత్తిపాడు: మండలంలో తొలిరోజు శుక్రవారం 70 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో 11,846 మంది పింఛనుదారులుండగా, ఈ నెల నుంచి ప్రభుత్వం నూతనంగా మరో 569 మందికి పింఛన్లు మంజూరు చేసిందన్నారు. కాగా సాయంత్రం 5 గంటల వరకూ సుమారు 8,690 మందికి వలంటీర్లు పింఛన్లు బట్వాడా చేసినట్టు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వలంటీర్లతో కలిసి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన మోగిలి అప్పారావు అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయన పింఛను సొమ్ములు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. గ్రామ వలంటీర్ వరా సౌందర్య సొంతఖర్చులతో కాకినాడ వెళ్లి అప్పారావుకు పింఛను అందజేసింది.



సీతారాంపురంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్



ప్రత్తిపాడులో లబ్ధిదారుడికి పింఛను అందిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ



కాకినాడలో ఆసుపత్రిలో వెంకట్రావుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ మణికంఠ

నేడు వైఎస్సార్ వర్ధంతి

తుని: పట్టణంలో శనివారం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు శుక్రవారం తెలిపారు. స్థానిక శ్రీరామా సెంటర్లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి కౌన్సిలర్లు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ఉపాధి నైపుణ్య శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంగా ఉన్నతి ఫౌండేషన్, ఇన్ఫోసిస్ సౌజన్యంతో విద్యార్థులకు ఉపాధి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. సునీత తెలిపారు. కళాశాలలో మొదటి బ్యాచ్‌లో 30 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బెంగళూరు ఉన్నతి ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన కె.శ్రీదేవి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి 30 రోజులకు ఒక బ్యాచ్ చొప్పున విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

- తాళ్లూరు రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం
- కొండావారిపేటలో రోడ్డు నిర్మాణానికి చర్యలు

తుని: ప్రభుత్వాలు మారినా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మాత్రం నెరవేరలేదు. గతంలో ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు ప్రయత్నించినా రైల్వేశాఖకు సంబంధించిన స్థలం కావడంతో ఇది మావల్ల కాదని చేతులెత్తేశారు. చిన్నపాటి వర్షం పడితే చాలు కొండవారిపేట రైల్వే అండర్ పాస్ నీటితో నిండిపోతోంది. పది వార్డులకు చెందిన ప్రజల రాక పోకలకు అంతరాయం కలుగుతోంది. రైల్వే ట్రాక్ అవతల ఉన్న ప్రజలు పట్టణంలోకి రావడానికి అష్టకష్టాలు పడుతున్నారు. కొండవారిపేట వద కొత్తగా రైల్వే అండర్ పాస్ నిర్మించాలని చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారం చూపాలన్న మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మున్సిపల్ పాలకవర్గం దృష్టి సారించింది. దీనిలో భాగంగా తాళ్లూరు రైల్వేగేటు వద్ద రూ.5 కోట్ల వ్యయంతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించారు. ఇక కొండవారిపేట అండర్ పాస్‌కు పరిష్కారం చూపాలని నిర్ణయం తీసుకున్నారు. కొండవారిపేట నుంచి తాళ్లూరు రైల్వే అండర్ బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.



కొండవారిపేట నుంచి తాళ్లూరు బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మాణానికి తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

30 వేల మందికి ప్రయోజనం

కొండవారిపేట నుంచి రైల్వే అండర్ పాస్ వరకు లింక్ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఇందుకు రైల్వే శాఖ, మార్కెట్ యార్డుకు చెందిన స్థలసేకరణ చేయాల్సి ఉంది. దీనిలో భాగంగా శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. రైల్వే అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే చేసి ఎంత స్థలం రోడ్డు నిర్మాణానికి అవసరం అవుతుందో గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు తెలిపారు. అనుమతులు రావడానికి కొంచెం ఆలస్యమైనా మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత సహకారంతో త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు. ఇదే జరిగితే 50 ఏళ్ల ప్రజల కల సాకారం కావడంతో పాటు 30 వేల మందికి ప్రయోజనం చేకూరుతుంది.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ ప్రారంభం

తొండంగి: మండలంలోని రావికంపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో అందించే అల్పాహారం పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. హరే కృష్ణ మూమ్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో 43 పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. దీనిలో భాగంగా రావికంపాడు హైస్కూల్లో సర్పంచ్ మేడిశెట్టి మంగయ్యమ్మ, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మేడిశెట్టి సుబ్బారావు అల్పాహారం పంపిణీని ప్రారంభించారు. ఇక నుంచి ప్రతి రోజూ ఉదయం పాఠశాలోని 270 మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తామని అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు వివరించారు. విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న అరబిందో ఫార్మా ఎండీ, వైస్ చైర్మన్ కె.నిత్యానందరెడ్డి, ఫౌండేషన్ డైరెక్టర్ పి.శరత్‌చంద్రారెడ్డిలకు సర్పంచ్, గ్రామపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సిద్దా శ్రీనివాసరావు, హెచ్ఎం ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రావికంపాడు హైస్కూల్లో విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఏలేశ్వరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ఏలేశ్వరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఏలేశ్వరం పట్టణంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, నీరుకొండ సత్యనారాయణ, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, సామంతుల చిన్నారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో విలేకరి మృతి



సుంకర సత్యనారాయణ

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామానికి చెందిన విలేకరి సుంకర సత్యనారాయణ (46) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. గత 22 ఏళ్లుగా విలేకరిగా పనిచేస్తున్న సత్యనారాయణ ప్రస్తుతం ఏలేశ్వరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతికి ఏలేశ్వరం ప్రెస్‌క్లబ్ విచారం వ్యక్తం చేసింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సత్యనారాయణ మృతికి పలువురు నాయకులు, అధికారులు సంతాపం తెలిపారు.

భవిత కేంద్రం పరిశీలన

ఏలేశ్వరం: పట్టణంలో భవిత కేంద్రాన్ని ఎస్ఎస్ఏ కో ఆర్డినేటర్, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు స్థానిక అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. భవిత కేంద్రంలో విద్యార్థుల కంప్యూటర్ టైపింగ్ నేర్చుకునే విధానాన్ని పరిశీలించారు. పిల్లలు తయారు చేసిన పేపర్ పువ్వులను చూసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ వారోత్సవాలు ప్రారంభం

తుని: భారతీయ జీవిత బీమా (ఎల్ఐసీ) సంస్థ అందిస్తున్న పాలసీలు ప్రజల జీవితాలకు భరోసా కల్పిస్తున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. తుని ఎల్ఐసీ కార్యాలయంలో శుక్రవారం బ్రాంచి మేనేజరు జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో 67వ వారోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జీవిత బీమా సంస్థ అందిస్తున్న పాలసీల పట్ల ప్రజలకు నమ్మకం ఉందని బాలు పేర్కొన్నారు. ప్రజలకు సత్వర సేవలు అందిస్తున్నామని బ్రాంచి మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ రుషిక, యూనియన్ అధ్యక్షుడు కేఎస్‌వీ సత్యనారాయణ, శోభన్‌కుమార్, సందీప్ రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఐసీ ఆవిర్భావ వారోత్సవాలు

గోకవరం: ఎల్ఐసీ 67వ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం గోకవరంలో బ్రాంచి మేనేజర్ కె. విద్యాసాగర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఎలిపే శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మొక్కలు నాటడం, విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలు, ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు సన్మానాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రసన్న కుమార్, స్వరాజ్యలక్ష్మి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



తునిలో జ్యోతి ప్రజ్వలన చేసి ఎల్ఐసీ వారోత్సవాలను ప్రారంభిస్తున్న బాలు

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువజ్ఝల అమరయ్య, ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకుడు చిట్టిం వాసు, నగేష్, వ్రతపురోహితులు చెల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ఆలయంలో సత్యదేవుని దేవేరి అనంత లక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

వరాలివ్వమ్మా వరలక్ష్మీ..



టి.తిమ్మాపురంలో సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



అమ్మవారికి బంగారు శతమానాలు సమర్పిస్తున్న భక్తులు



గాజుల అలంకరణలో గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారు

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తొండంగి: గోపాలపట్నంలోని నేరేళ్లమ్మ అమ్మవారు శుక్రవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసంలో మూడో శుక్రవారం కావడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతలు సమర్పించిన గాజులను అమ్మవారికి అలంకరించారు. పండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాముహిక కుంకుమార్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించారు. ఆలయ నిర్వాహకుడు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ యడ్ల శ్రీనువాస్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. రావికంపాడులోని మహిషాసురమర్ధిని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తుని రూరల్: శ్రావణమాసంలో మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, గెడ్లబీడు సమీపంలో ధారాలమ్మ ఆలయం, టి.తిమ్మాపురం మహావిష్ణువు ఆలయంలో సామూహిక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు మహిళలు తమ స్వగృహాల్లో వరలక్ష్మీదేవి వ్రతాలను ఆచరించారు. అనంతరం ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గాజుల అలంకరణతో అభయ దుర్గమ్మ

కిర్లంపూడి: శ్రావణ మాసంలో మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జగపతినగరంలోని అభయ దుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేక గాజులతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు బాదంపూడి వైద్యనాథశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దేవీచౌక్ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. పవిత్ర శ్రావణ మాసంలో మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వెండి, బంగారం ఆభరణలతో సుందరంగా అలంకరించారు. సూర్రెడ్డి చిరంజీవి, రూపలక్ష్మి, పడాల సాయిబాబా రెడ్డి, హరిత దంపతులు అమ్మవారికి కాసు బంగారు శతమానాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకూ మేలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు జరుగుతోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలో కామాక్షి కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ చేతివృత్తుల వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కులాలు, వర్గాలు, చేతివృత్తుల వారికి పథకాలు వర్తింప చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేతివృత్తుల వారిని అన్నివిధాలా ఆదుకుంటోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టేందుకు చేతివృత్తుల వారు తమ సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, దేగల వెంకటరమణ, జువ్విన వీర్రాజు, వాగు బలరామ్, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్

గుర్రంపాలెంలో నాభూమి-నాదేశం

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెంలో శుక్రవారం నాభూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నేతలు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌పై అవగాహన కల్పించి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కృష్ణవర్మ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ భారతీయులంతా ఒక్కటే అని అందరికీ తెలిసే విధంగా దేశవ్యాప్తంగా సేకరించిన మట్టితో ఢిల్లీలో సామాజిక వనాన్ని నిర్మించతలపెట్టారన్నారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరించి జిల్లా కేంద్రానికి పంపుతామని, అక్కడ నుంచి ఢిల్లీకి చేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట గంగరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, జిల్లా కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడు బాలిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.